## క్లుప్తంగా

### దళిత మహిళ ఆత్మహత్యపై..

ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పొలంపల్లి గ్రామంలో దళిత మహిళ లక్ష్మి ఆత్మహత్యకు కారణమైన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు హైదరాబాద్‌లో వినతిపత్రం అందించినట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ తెలిపారు. పొలంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి దళిత మహిళపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టి వేధించడంతోనే ఈనెల 12న ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్, కొండి స్వామి, నర్సింగారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 11 మంది వార్డు ఆఫీసర్ల బదిలీ



వార్డు ఆఫీసర్లను సన్మానిస్తున్న కమిషనర్ దేవేందర్

రామాయంపేట(మెదక్): స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న 11 మంది వార్డు ఆఫీసర్లు తమ సొంత శాఖలకు బదిలీపై వెళ్లారు. దీంతో 12 మంది వార్డు ఆఫీసర్లలో 11 మంది బదిలీపై వెళ్లిపోవడంతో ఈపోస్టులు ఖాళీగా మారాయి. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో కమిషనర్ దేవేందర్, మేనేజర్ రఘువరన్ వారిని ఘనంగా సన్మానించారు.

### బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు గ్రామాల్లో బుధవారం బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఇంటి ముంగిళ్లలో పేడతో అలికి ముగ్గులను వేసి పూవ్వులతో అలంకరించి బొడ్డెమ్మ ఆడిపాడారు. కార్యక్రమాల్లో మహిళలు యువతులు, చిన్నారులు పాల్గొన్నారు.

### పశువుల పాకకు దోమల తెర

శివ్వంపేట(నర్సాపూర్): దోమల వల్ల పశువులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ఓ రైతు పాక చుట్టూ దోమల తెర (జాలి) ఏర్పాటు చేశాడు. మండల పరిధి చండీగ్రామంలో రైతు ఆంజనేయులు పాడి గేదెలతో ఉపాధి పొందుతున్నాడు. దోమల వల్ల నిత్యం గేదెలు ఇబ్బందులు పడుతుడటంతో పాక చుట్టూ సన్నటి తెర ఏర్పాటు చేయడంతో దోమలు, ఈగల నుంచి పశువులకు ఇబ్బంది తొలగిపోయిందని రైతు అంటున్నాడు.

### ఐకమత్యంతోనే సంఘాల అభివృద్ధి

పెద్దశంకరంపేట(మెదక్): ఐకమత్యంతోనే సంఘాల అభివృద్ధి సాధ్యమవుతుందని అఖిలభారత నీలకంఠ సమాజం అధ్యక్షుడు లోక లక్ష్మీరాజ్యం, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో నీలకంఠ సంఘం 30వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీలకంఠ సభ్యులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం బాధ్యులు కడవెర్గు నర్సింలు, వీరబత్తిని అంబయ్య, దయానంద్, మండల నీలకంఠ సంఘం అధ్యక్షుడు విఠల్, మహిళా అధ్యక్షురాలు అరుణ, అడిషనల్ కలెక్టర్ నటరాజ్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ తదితరులున్నారు.

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి




అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్లాదుర్గం(మెదక్): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ పేర్కొన్నారు. బుధవారం అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను వాడితే జీవితం నాశనమవుతుందన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్తయ్య, ఏఎస్‌ఐ గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన సంబురాలు

## రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు మువ్వన్నెల జెండా ఎగురవేశారు. అనంతరం అమరవీరుల పోరాటాలు, త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సెప్టెంబర 17 తెలంగాణ చరిత్రలోనే అత్యంత కీలకమైందని వెల్లడించారు. ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితంగా నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిందన్నారు.



నర్సాపూర్: జాతీయ జెండా ఎగురవేస్తున్న ఆర్డీఓ మహిపాల్



వెల్దుర్తి: మాసాయిపేట తహసీల్దార్ కార్యాలయంలో..



శివ్వంపేట: జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ కమలాద్రి



కౌడిపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో..



టేక్మాల్: జెండా ఆవిష్కరణ చేసిన తహసీల్దార్



అల్లాదుర్గం: సీఐ కార్యాలయంలో..



రామాయంపేట: జెండా ఎగురవేస్తున్న కమిషనర్ దేవేందర్



నిజాంపేట: తహసీల్దార్ కార్యాలయంలో...



పెద్దశంకరంపేట: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్



తూప్రాన్: ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి, నాయకులు



తూప్రాన్: మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి, నాయకులు

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

రేగోడ్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో బుధవారం రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉన్నత పాఠశాల వద్ద రూ.3.50లక్షలతో విద్యార్థులకు సైకిల్ షెల్టర్, పోచారంలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మంత్రి దామోదర రాజనర్సింహ గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీతారావమ్మ, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, మాజీ చైర్మన్ రాధకిషన్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

### నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. మండల పరిధి దొంతిలో నిలిచిపోయిన పనులు గురించి బీఆర్ఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు రోడ్డు విస్తరణ పనులు, నూతన సబ్‌స్టేషన్, విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించగా...వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు లాయక్, శ్రీనివాస్‌గుప్తా, కుమార్, సత్యనారాయణ ఉన్నారు.

### రాయిలాపూర్‌లో ఇంటింటి సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం నర్సాపూర్ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్)-1 కోఆర్డినేటర్ డాక్టర్ సురేషకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బేటి పడావో బేటి బచావో, సేంద్రియ వ్యవసాయం, బాలిక విద్య అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై సర్వే నిర్వహించడంతో పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూమి, భుక్తి కోసం పోరాటం



మాట్లాడుతున్న అడివయ్య

చేగుంట(తూప్రాన్): భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించినట్లు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడివయ్య పేర్కొన్నారు. బుధవారం పొలంపల్లి శివారులోని కేవల్ కిషన్ సమాధి వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అడివయ్య మాట్లాడుతూ తెలంగాణలో దున్నేవాడికే భూమి పేరుతో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసింది కమ్యూనిస్టులేనన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం, అజయ్, యాదగిరి, సత్యం, శౌకత్, లక్ష్మినర్సయ్య, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

# చండీ-గోమారం రోడ్డుకు కొత్త శోభ



రోడ్డు విస్తరణతో కొత్తశోభ

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ బీటీ రోడ్డు విస్తరణతో కొత్తశోభ సంతరించుకుంది. మండల పరిధి పోతులబోగూడ నుంచి నవాబుపేట వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు సీఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. కొన్నాళ్లపాటు పనులు నిలిచిపోగా 15 రోజుల నుంచి రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి చౌరస్తా, చండీ-గోమారం గ్రామాల వద్ద బీటీ పనులు పూర్తయ్యాయి. తూప్రాన్- నర్సాపూర్ హైవే నుంచి చండీ గ్రామం మీదుగా గోమారంకు వెళ్లే ఇదే రోడ్డును కిలోమీటరు మేర విస్తరించలేదు. ఈ రోడ్డు ఇరుకుగా ఉండటంతోపాటు పలుచోట్ల ప్రమాదకరంగా మూలమలుపులున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కిలోమీటరు మేర రోడ్డు విస్తరణ చేస్తే చండీ గ్రామ ప్రజలకు వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి



నిజాంపేటలో విశ్వకర్మ జయంతి వేడుకల్లో నాయకులు



పెద్దశంకరంపేట(మెదక్): ర్యాలీ నిర్వహిస్తున్న స్వర్ణకార సంఘం సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని పరిశ్రమలో స్టీల్ పరిశ్రమలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. బుధవారం విశ్వకర్మ పూజలు, హోమం నిర్వహించారు. ఈ వేడుకల్లో పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్స్ స్నేహిల్ సరాఫ్, జీఎం ప్రభాత్ కుమార్ గుప్త, హెచ్ఆర్ రమేశ్, ఆర్‌పీ సింగ్, మాజీ ఎంపీపీ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, ఏదుల్‌మీయా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వర్ణకార సంఘం భవనంలో జెండాను ఆవిష్కరించడంతో పాటు హోమం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు నర్సింలు, సంతోష్, రాములు, నర్సింహాచారి, మహేశ్, శ్రీనివాస్, సాయి తదితరులున్నారు.

**నిజాంపేటలో...**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. బుధవారం స్థానిక బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణం వద్ద విశ్వకర్మ చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు పులిమామిడి నరసింహ చారి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి ఎల్లం, రామస్వామి, బాల్‌నర్సింలు, సుదర్శనం, స్వామి, బాబురావు, మురళి, నాగరాజు, రామచంద్రం పాల్గొన్నారు.

### వేడుకల్లో మంత్రి, ఎమ్మెల్యే



వేడుకల్లో పాల్గొన్న మంత్రి వివేక్

నర్సాపూర్ రూరల్: మండల కేంద్రంతోపాటు పెద్ద చింతకుంటలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా యజ్ఞం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అంతకుముందు విశ్వ కర్మలు వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఇన్‌చార్జి మంత్రి వివేక్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్, ఆయా రాజకీయ పార్టీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే, నర్సాపూర్ పట్టణంలోని లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు.

# ప్రధాని మోదీతోనే అభివృద్ధి సాధ్యం

ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. రోగులకు పండ్లు, అన్నదానం, రక్తదానాలు చేశారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీతోనే భారతదేశ అభివృద్ధి సాధ్యం అన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): మహిళకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయంలో పూజలు



చేగుంట(తూప్రాన్): చేగుంటలో...

# పోషణతో కూడిన విద్య అందించాలి



అంగన్‌వాడీ టీచర్లకు పోస్టర్లతో శిక్షణ ఇస్తున్న అధికారులు

నర్సాపూర్ : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే ప్రతి బిడ్డకు పోషణతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. సూపర్‌వైజర్లు కవిత, లక్ష్మినర్సమ్మ, సంతోషిమాత, సుల్తానా, సంతోష, లక్ష్మి రెండు బృందాలుగా ఏర్పడి నర్సాపూర్, శివ్వంపేట, చిలిపిచెడ్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం చివరి రోజు పలు అంశాల గురించి వివరించారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు పోషణతో పాటు మంచి విద్య అందించాలని సూచించారు. సున్నా నుంచి మూడేళ్ల పిల్లలకు గృహ సందర్శన ద్వారా పోషణతో పాటు అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు. పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు.



మాట్లాడుతున్న సీడీపీఓ స్వరూప

**అంగన్‌వాడీల్లో పోషణ వారోత్సవాలు**

రామాయంపేట(మెదక్): అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజులపాటు పోషణ మాసోత్సవాలు కొనసాగుతాయని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో స్వరూప పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం పోషణ మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సెక్టార్ పరిధిలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీ, ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ, సెక్టార్ పరిధిలోని ఏడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.